ప్రజాశక్తి
సోమవారం 6 నవంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు



తాగునీటి ట్యాంక్‌లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి: తాజంగిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామీణ నీటిపారుదల శాఖ జేఈ గడుతూరి స్వర్ణలతతో కలిసి వాటర్ ట్యాంకులకు సర్పంచ్ వంతల మహేశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుమారు 30 లక్షలతో రెండు బోర్లు, రెండు పంప్ హౌస్‌లు, వాటర్ ట్యాంకులు, ఇంటింటకి కుళాయిలు ఏర్పాటు చేస్తారన్నారు. తాజంగిలో రెండు వాటర్ ట్యాంకులు ఉన్నా నీరు సరిపోలేని పరిస్థితి ఉందని, దీంతో కొన్ని వీధుల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. నూతనంగా రెండు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణంతో సమస్య తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ వార్డు సభ్యుడు కిలో సదాశివ, వంతల బాబురావు, కావేర్ల గణపతి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెఇ, సర్పంచ్

ఆదివాసీలను కదిలిస్తూ..

◆ రంపచోడవరం ఏజెన్సీలో మార్మోగిన ప్రజా రక్షణ భేరి ◆ కదిలివచ్చిన పోలవరం నిర్వాసితులు ◆ ఆలోచింపజేసిన సిపిఎం నేతల ప్రసంగాలు



చింతూరులో యాత్రా బృందానికి స్వాగతం పలుకుతూ సాగుతున్న బైకు ర్యాలీ

ప్రజాశక్తి - చింతూరు, మారేడుమిల్లి, విఆర్.పురం, కూనవరం, ఎటపాక విలేకరులు

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర రంపచోడవరం ఏజెన్సీలో ఆదివారం ఉత్తేజంగా సాగింది. పోలవరం నిర్వాసితులను వారి సమస్యలపై కదిలించింది. యాత్రకు అన్నిచోట్లా అపూర్వ ఆదరణ దక్కింది. జనం పూలవర్షం కురిపించారు. అమరుల విగ్రహాలు, స్తూపాల వద్ద సిపిఎం నేతలు నివాళ్లర్పిస్తూ ముందుకు సాగారు. పలు సభల్లో వారు చేసిన ప్రసంగాలు ప్రజలను ఆలోచింపజేశాయి.

అల్లూరి జిల్లాలోని మారేడుమిల్లి, చింతూరు, విఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలం తోటపల్లిల్లో బస్సు యాత్ర సాగింది. ఆయా చోట్ల జరిగిన సభల్లో యాత్ర రథసారథి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. అడవిలోని వనరులు, ఖనిజాలు, భూమిపై ప్రభుత్వానికి ప్రేమ తప్ప గిరిజనులపై లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. అల్లూరి జిల్లాకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఏజెన్సీలో బాస్ ఈజ్ బ్యాక్ పేరిట ఎమ్మెల్సీ అనంతబాబువి పెద్దపెద్ద బ్యానర్లు కనబడుతున్నాయని, దగాకోర్లు, దొంగలు, గంజాయి మాఫియా చేసే వాళ్లకు తప్ప ఆయన ప్రజలకు బాస్ కారని తెలిపారు. హత్యలు, డోర్ డెలివరీలు చేసే వాళ్ల లీడర్లా ? వాళ్లని రాజకీయాల్లో ఆదర్శంగా తీసుకోవాలా ? అని ప్రశ్నించారు. పనికిమాలిన రాజకీయాలు వైసిపి చేస్తోందని విమర్శించారు. నిరంతరం ప్రజా సమస్యలపై ఉద్యమించే సిపిఎం, వామపక్షాలను బలపరచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, అశోక్, రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, నాయకులు పల్లపు వెంకట్, సోయం చిన్నబాబు, ఎంపిపి కారం లక్ష్మి, పూనెం సత్యనారాయణ, సీసం రమేష్, పులి సంతోష్ కుమార్, పూనెం సరోజిని, వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, మాజీ జెడ్‌పిటిసి రంగమ్మ, పోడియం లక్ష్మణ్, మొత్తం రాజయ్య, మేకల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ ఘన స్వాగతం

మారేడుమిల్లిలో.. స్థానిక పోలీస్ స్టేషన్ కూడలి వద్ద యాత్రకు ఘన స్వాగతం లభించింది. సిపిఎం మండల నాయకులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి ఆధ్వర్యంలో సభ జరిగింది.

చింతూరులో.. మండల కేంద్రంలోని తులసిపాక వద్ద యాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. గిరిజన సంప్రదాయ ఆయుధాలైన విల్లంబులను యాత్ర రథసారథి వి.శ్రీనివాసరావు తదితరులకు స్థానికులు అందజేశారు. తులసిపాక గ్రామం నుంచి చింతూరు మండల కేంద్రం వరకు 15 కిలోమీటర్ల మేర బైకు ర్యాలీ సాగింది. అమరవీరుల సెంటర్ వద్ద సభ ఏర్పాటు చేశారు. కామ్రేడ్ బత్తుల భీష్మారావు వర్ధంతి సభలో వక్తలు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు.

విఆర్.పురంలో.. చొప్పల్లి గ్రామం వద్ద ప్రజలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి సున్నంవారి గూడెం వరకూ బైకు ర్యాలీ సాగింది. మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య స్మారక స్తూపం వద్ద నివాళ్లర్పించారు. అనంతరం రేఖపల్లి వద్ద బహిరంగ సభ జరిగింది. విఆర్.పురంలోని బిసి కాలనీని ముంపు జాబితాలో చేర్చి నష్టపరిహారం ఇవ్వాలని పలువురు అర్జీలు ఇచ్చారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని మాజీ ఎంపిపి నాగమ్మ చేతులమీదుగా పలువురు వినతులు సమర్పించారు. నాగేంద్ర పురం గ్రామంలో రోడ్డు, కరెంటు, మంచినీటి సౌకర్యం బాలేదంటూ యాత్రా బృందానికి వినతులు సమర్పించారు.

కూనవరంలో.. స్థానికంగా యాత్రకు విశేష స్పందన లభించింది. కళారూపాలు ఆకట్టుకున్నాయి. సభకు కొమరం పెంటయ్య అధ్యక్షత వహించారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలంటూ యాత్రా బృందానికి పలువురు వినతులు సమర్పించారు.


ఎటపాకలో.. తోటపల్లి వద్ద బస్సు యాత్ర బృందానికి మహిళలు పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభకు సిపిఎం మండల కార్యదర్శి ఐవి అధ్యక్షత వహించారు.



చింతూరులో అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కాలేజీని పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, సురేంద్ర, కిరణ్ తదితరులు

అల్లూరి జిల్లాలో వినతుల వెల్లువ

ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర వెళ్లిన ప్రతి చోటా అపూర్వ స్పందన లభించింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో అక్టోబర్ 30న ప్రారంభమైన బస్సు యాత్ర విజయనగరం జిల్లాలోని గిరిజన గ్రామాల మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి ప్రవేశించి ఆదివారం రాత్రి ఎటపాక మండలం తోటపల్లి సభతో ముగిసింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో సాగుతున్న యాత్రా బృందానికి ఆదివాసీలు, స్కీం వర్కర్లు అనేక సమస్యలపై వినతులు అందజేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, సిహెచ్‌డబ్ల్యులు, గిరిజనులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలని, పోడు భూములపై హక్కు కల్పించాలని, పిటిజిలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలన్న వినతులు ఎక్కువగా వచ్చాయి. పోలవరం ముంపు ప్రాంత నిర్వాసితులను గుర్తించి పరిహారం ఇప్పించాలని రంపచోడవరం డివిజన్‌లో పలువురు వినతులు అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, మందులు సరిపడా లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను తెలిపారు. చింతూరులో అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కాలేజీని శ్రీనివాసరావు పరిశీలించారు. టిడిపి ప్రభుత్వంలో ప్రారంభించిన డిగ్రీ కాలేజీ నిర్మాణం, వైసిపి ప్రభుత్వంలో కూడా పూర్తి కాలేదు. గిరిజనుల చదువుల పట్ల ప్రభుత్వాలకు ఉన్న శ్రద్ధ ఏ పాటిదో అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కాలేజీ చూసినవారెవరికయినా అర్థమవుతుంది. విద్య, వైద్యం వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వాలు స్పందించని విషయాలు వెలుగుచూశాయి.



కూనవరంలో వినతిపత్రం అందజేస్తున్న బాధితులు



సీలేరు వారపు సంతలో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

కొండెక్కిన కూరగాయల ధరలు

- ఆందోళనలో వినియోగదారులు

ప్రజాశక్తి -సీలేరు

కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఏ కూరగాయ ధర కిలో రూ.60 తక్కువ లేదు. రూ.100 వరకు ధర పలుకుతున్న కూరగాయలున్నాయి. జీకే వీధి మండలం సీలేరు వారపు సంతలో ఆదివారం ఉల్లిపాయలు, టమాటా ఇతర కూరగాయల ధరలు అధికంగా ఉండటంతో వినియోగదారులు ఆందోళన గురయ్యారు. ఆదివారం నాటి సీలేరు వారపు సంతలో కిలో ఉల్లి ఒక రకం రూ.70, మరో రకం రూ.60కు విక్రయాలు జరిపారు. ఆగాకరకాయ కిలో రూ.80, బీరకాయలు రూ.80, కాలీఫ్లవర్ రూ.100, చిక్కుళ్ళు కిలో రూ.60 చొప్పున వ్యాపారులు విక్రయాలు జరిపారు. అధిక మొత్తంలో కూరగాయల ధరలు పెరగడంతో కొనేందుకు వినియోగదారులు కాస్త వెనక్కి తగ్గి అరకొరగా కొనుగోలు చేశారు.

ఒకపక్క వర్షా భావ పరిస్థితులు అనుకూలంగా లేక గిరిజన రైతులు పంటలు పూర్తిగా ఎండిపోయాయి. మరోపక్క బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు ఉల్లి, టమాటా, మిర్చి, కూరగాయలు ధరలు పెరిగిపోవడంతో వారపు సంతకు వచ్చిన గిరిజనులు, దినసరి కూలీలు కొనుగోలు చేయలేక తీవ్ర ఆందోళన గురయ్యారు. ప్రతి వంటకంలో భాగమైన ఉల్లి, టమాటా, పచ్చిమిర్చి ఎంత ధర పెరిగినా కొనుగోలు చేయడం తప్పడం లేదు. ధరలు పెరగడంతో స్థానిక ఏపీ జెన్కో ఉద్యోగులు సైతం విరివిగా కాయగూరలు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి కనబరచలేదు. దీంతో వారపు సంతులో వ్యాపారాలు మందకుడిగానే సాగాయి.



పట్టుబడిన నాటు సారా, నిందితునితో పోలీసులు

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

- నిందితుని అరెస్టు

ప్రజాశక్తి -కొయ్యూరు

మండలంలోని దొడ్డవరం గ్రామ సరిహద్దు ప్రాంతంలో పోలీసులు 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్ఐ రాజారావు కథనం ప్రకారం... దొడ్డవరం గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన తంటపురెడ్డి వీర్రాజు అనే వ్యక్తి నాటుసారా తయారు చేస్తున్నాడని పోలీసులు గుర్తించి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజారావు మాట్లాడుతూ ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా, కొయ్యూరు మండలంలో నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టరు

ఉచిత వైద్య శిబిరం


ప్రజాశక్తి-రంపచోడవరం

రాజమండ్రి వారి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు దాసరి ఉమ మహేష్, తలారి వెంకట సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్ తదితరులు పాల్గొని సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన 58 మందికి రక్త పరీక్షలు, తొమ్మిది మందికి థైరాయిడ్ పరీక్షలు, 10 మందికి ఎక్స్‌రేలు, 10 మందికి ఫిజియథెరపీలు చేశారు. రోగులకు, సహాయకులకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, క్యాంప్ కో - ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది గాధిరాజు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కొయ్యూరు

జిల్లా కేంద్రం పాడేరులో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న బిర్సా ముండా 149వ జయంతి వేడుకలకు సంబంధించిన గోడ పత్రికలు మండలంలోని రాజేంద్ర పాలెం అంబేద్కర్ విగ్రహం ఆదివారం ఉద్యోగ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిర్సా ముండా జయంతి వేడుకలకు గిరిజనులందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు సీందేరి సన్యాసిరావు, బూరుగు వెంకటరావు, శ్యామల వరలక్ష్మి, పాడి లోవరాజు, కే.బాబూరావు, పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన ఉద్యోగులు



నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

ముమ్మరంగా పాఠశాల భవనం పనులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని వేంగడ పంచాయతీ డొంగపుట్టు గ్రామంలో పాఠశాల భవనం లేక విద్యార్థుల అవస్థలపై పాఠశాల ఏర్పాటు చేయండి ప్రభో అంటూ రెండు నెలల క్రితం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి స్పందించిన ఐటీడీఏ పీవో అభిషేక్ పాఠశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ఐటీడీఏ నిధులు సుమారు రూ.6 .లక్షలు మంజూరు చేయగా పాఠశాల భవనం నెల రోజులకే పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. ప్లాస్టింగ్ అనంతరం పై కప్పు రేకులు వేసి పాఠశాలను విద్యాశాఖ అధికారులకు అప్పగించవలసి ఉంది. ఈ పాఠశాలలో డాలింపుట్టు, మెట్టపాడు, డొంకపుట్టు, పెన్నంతి గ్రామాలకు చెందిన 67 మంది విద్యార్థులు రేకుల షెడ్డు వద్ద కటిక నేలపై చదువుకుంటున్నారు. వర్షాకాలంలో పూర్తిగా వర్షపు నీరు చేరి కూర్చోలేని పరిస్థితితో విద్యా బోధనలు సాగుతున్నట్లు వార్తా కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఐటీడీఏ పివో పాఠశాల ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

ప్రతినెలా రూ.1000 సాయం

ప్రజాశక్తి-చింతపల్లి: వికలాంగులను ఆదుకోవడంలో చేయూత వారియర్స్ ట్రస్ట్ ఉదారతను చాటుకుంది. గ్రామంలోని సాయి నగర్ వీధికి చెందిన కిల్లో చంద్రమోహన్ నాయుడు. గత కొన్నేళ్లుగా అనారోగ్యం బారినపడి నరాల బలహీనతతో ఇంటికే పరిమితం అయ్యాడు. విద్యలోనే గాక, చదరంగంలోనూ ప్రతిభ చూపే చంద్రమోహన్ కొన్నేళ్లపాటు చింతపల్లిలో సాక్షి దినపత్రికలో పాత్రికేయుగా పనిచేశారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నరాల బలహీనతతో ఇంటికే పరిమితం అయ్యాడు. ఈ మేరకు చేయూత వారియర్స్ చంద్రమోహన్ కుటుంబానికి ప్రతి నెల 1000 ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు రావడమే గాక, ఆదివారం ఆ కుటుంబానికి వెయ్యి రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఈరెల్లి రాజేష్, చంద్రమోహన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న ట్రస్టు సభ్యులు

ఇళ్ల స్థలాల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-చింతపల్లి: పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర క్యాబినెట్ సమావేశం లో తీర్మానం చేయడం హర్షనీయమని చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేశెట్టి సత్యనారాయణ (సతీష్) అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, దశాబ్దాల కాలంగా పాత్రికేయ వృత్తిని నమ్ముకుని ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికై తమ వంతు భూమిక పోషిస్తున్న పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కేటాయింపుకు ప్రభుత్వం తీర్మానం చేయడం హర్షించదగ్గ పరిణామన్నారు. ఐదవ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం అమలులో ఉండటంతో గిరిజనేతర పాత్రికేయులకు ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు గడచిన కొన్నేళ్లుగా జాప్యం జరుగుతుందన్నారు. క్యాబినెట్ లో తీర్మానం చేయడం సంతోష కరమన్నారు.

తీవ్ర వర్షాభావంతో ఎండిపోయిన వరి పంటలు

దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



వర్షాధార భూముల్లో ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -విఆర్.పురం

ఈ ఏడాది తీవ్ర వర్షా భావ పరిస్థితులు నెలకొనడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. మండలంలోని వరి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది కష్టాలు వెంటాడుతున్నాయి. సాగునీరు లేక వరిసాగు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు దిక్కుతోయని స్థితిలో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మండల వ్యాప్తంగా సన్న, చిన్న కారు రైతులు ఈ ఏడాది సుమారు 48 హెక్టార్లలో వరిని సాగు చేశారు. తొలిత గోదావరి వరదలు కారణంగా వరి పంట సాగు ఆలస్యమైంది. వరదల నుండి తేరుకొని వరి నాట్లు వేయగా, తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మైనర్, మేజర్ ఇరిగేషన్, చెరువులు కింద ఉన్న భూముల్లో పంటలను రైతులు కొద్ది మేరకు కాపాడుకుంటూ వచ్చారు. అయితే అక్టోబర్‌లో పూర్తిగా వర్షాలు లేకపోవడంతో ఆ నీటి వనరులు కూడా ఇంకిపోయాయి. ఇరిగేషన్, చెరువులు కింద ఉన్న ప్రాంతాల్లో వరి పంట పొట్ట దశకు వచ్చి ఉంది. ఈ నేపథ్యంలో ఆ పంటను ఎలా రక్షించుకోవాలో తెలియక దిక్కుతోచని పరిస్థితి రైతులు ఉన్నారు. మరో వైపు పూర్తి వర్షాధార భూముల్లో సాగు చేసిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడులు కూడా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వర్షాభావ పరిస్థితుల దృష్యా ఎండిపోయిన పంటలను సర్వే చేసి నష్ట పరిహారాన్ని చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

మా పొలాలన్నీ ఎండిపోయాయి



ఈ ఏడాది వరదలు కారణంగా వరి నాట్లు ఆలస్యంగా వేయాల్సి వచ్చింది. తరువాత వర్షాలు లేకపోవడంతో మా వరి పొలాలు ఎండిపోతున్నాయి. చెరువుల్లో కూడా నీరు లేకపోవడంతో దుక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు రూ.15వేలు వరకు పెట్టుబడి పెట్టాం. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలి.

- గుండెపొడి సీతయ్య, రైతు, చింత రేగుపల్లి

అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు



వరుణుడు కరుణించకపోవడంతో పంట చేతికి అందకుండానే పోతుంది. పంటలు ఎండిపోతుంటే ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాం.

- సోడి వెంకయ్య, ఉమ్మడివరం

ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి



ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో వేసిన వరి పంటకు సాగునీరు అందక మా పొలాలు ఎండిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి శ్రమించినా ఫలితం లేకుండా పోతుంది. ప్రభుత్వం మా ఇబ్బందులను ఆలోచించి నష్ట పరిహారాన్ని చెల్లించాలి.

- ముత్యాల సీతయ్య, రైతు గుండుగూడెం

రైతుకు సాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : వర్షాభావ పరిస్థితుల్లో సాగునీరు లేక రైతు విలవిలలాడిపోతున్నాడు. వర్షాధార భూముల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయింది. కొద్ది మేరకు నీటి వనరులు ఉండి పంటను కాపాడుకుంటూ వచ్చిన ప్రాంతాల్లో వరి పొట్ట దశలో ఉండగా, ఇప్పుడు సాగునీరు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం ప్రతి ఏడాది మండలంలో సుమారు 1400 హెక్టార్లకుపైగా రైతులు వరిని సాగు చేయగా, ఈ ఏడాది మెట్ట ప్రాంతాల్లో సైతం వరి సాగు చేయడంతో సుమారు 1800 హెక్టార్లకు వరకు వరిని సాగుచేసినట్టు సమాచారం. అయితే మర్రివాడ, దొడ్డవరం, తాళ్లపాలెం గ్రామాల్లో మాత్రం పంటకాలువ వంతెన కూలిపోవడంతో రైతులు వరిసాగు చేయలేదు. బూదరాళ్ల పంచాయతీలోని చౌడుపల్లి, కొనుకూరు, బాలరేవుల, సాకులపాలెం పరిసర గ్రామాలు పూర్తి వర్షాధారం కావడంతో నీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయి. కొయ్యూరు, రేవళ్ల, డౌనూరు, బాలారం, కంతారం, రావణాపల్లి, మంప, శరభన్నపాలెం, చిట్టింపాడు తదితర ప్రాంతాల్లో రైతులు వరి పంటను కాపాడుకుంటూ వచ్చారు. అయితే ప్రస్తుతం వరిపొలాలు పొట్టదశలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో గత నెలంతా వరుణుడు ముఖం చాటేయడంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కొన్నిప్రాంతాల్లో తవ్విన చెరువులు, నిర్మించిన చెక్ డ్యాంలు మరమ్మతులకు గురై నీరు నిల్వ లేకపోవడంతో పంటలకు సాగునీరు అందడం లేదు. ఈ సమయంలో పంట ఎక్కడ నష్టపోతామోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు వర్షానికై ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.



చౌడుపల్లిలో నీరు లేక ఎండిపోయిన వరి చేను



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

శిథిలావస్థలో పాఠశాల భవనం

భయంతో ఆరుబయటే విద్యా బోధన

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇదీ పెదగంగుడి విద్యార్థుల దుస్థితి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయితీ పెదగంగుడీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. శిథిలావస్థకు చేరి పై పెచ్చులు ఊడి పడుతుండటంతో భయంతో ఆరు బయట విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొంది. భవనం పగులు ఏర్పడి కూలి పోతుందన్న పరిస్థితి ఉందని, దీంతో భయంతో విద్యార్థులు బిక్కు బిక్కుమంటు చదువులు కొనసాగిస్తున్నారు.

పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి సుమారు నాలుగేళ్ళు గడుస్తున్నా ఇప్పటికీ అధికారులు మరమ్మతు పనులు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. అ పాఠశాలలో సుమారు 23 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు తరగతి గది లోపల కారుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు నేడు పథకం ద్వారా నిధులు మంజూరు చేసి మరమ్మతు చేపట్టాలని పలుమార్లు ప్రతిపాదనలు పెట్టినా అధికారులు పట్టించుకోలేదని ఉపాధ్యాయురాలు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి విద్య నందిస్తామని గొప్పలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రచార అర్భాటాలకే పరిమితం అవుతుందని తల్లీదండ్రులు మండి పడుతున్నారు.స్థానిక ఎమ్మెల్యే పాల్గుణ ఆ గ్రామంలో పర్యటించి పాఠశాల భవనాన్ని చూసి నూతన భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం మరమ్మతు చేపట్టాలని ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



భయంతో ఆరు బయటే చదువుతున్న విద్యార్థులు

గిరిజన పంటలకు గిరాకీ

- పాడేరులో వేకువజామున సంత
- నాగలి దుంపలు, పచ్చి గుమ్మడి కాయలు, బొస్తరు పిక్కలు సీజన్ ప్రారంభం
- కార్తీక మాసంతో కూరగాయలకు డిమాండ్



పాడేరు సంతకు గిరిజనులు తెచ్చిన గుమ్మడి కాయలు

ప్రజాశక్తి-పాడేరు: శీతాకాలం ప్రారంభం కావడంతో మన్యంలో జరిగే వారపు సంతలు మంచు ముసుగులో సాగుతున్నాయి.పాడేరులో ప్రతిరోజు వేకువ జామున జరిగే సంత కిటకిటలాడుతోంది.వేకువ జామున దట్టంగా మంచు కురిసే వేళలోనే గిరిజన రైతులు తమ కూరగాయల ఉత్పత్తులను సంతకు తరలించి విక్రయిస్తుంటారు. అటు వ్యాపారులు కూడా పొద్దెక్కకముందే కొనుగోలు చేసే కూరగాయల ఉత్పత్తులను తాజాగా ఉండేలా మన్యం సమీపంలోని రిటైల్ మార్కెట్లకు తరలిస్తుంటారు. గిరిజనులు పండించే పలు రకాల కూర గాయల ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉంది. కార్తీక మాసం వస్తుండటంతో వీటికి మరింత గిరాకీ పెరిగింది. ఏజెన్సీలో విరివిగా లభించే నాగలి దుంపలకు, బొస్తరు పిక్కలకు ఇప్పుడు సీజన్ ఆరంభం అయింది. నవంబర్, డిసెంబర్ నెలలో ఈ రెండు కూరగాయల ఉత్పత్తులు విస్తారంగా లభ్యమవుతుంటాయి. వీటిని ఒడిశా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు. ఏపీలోని అనకాపల్లి, విశాఖపట్నం రాజమండ్రి తదితర ప్రాంతాలకు ఎక్కువగా ఉత్పత్తులు తరలిస్తుంటారు. పాడేరులో వేకువ జామున జరుగుతున్న వారపు సంతకు ప్రస్తుతం దిగుబడి వస్తున్న నాగలి దుంపలు, పచ్చి గుమ్మడికాయలు, అల్లం, క్యారెట్, బీట్రూట్ ముల్లంగి, క్యాలీఫ్లవర్, టమోటా, చిలకడదుంపలు బంగాళాదుంపలు వంటి ఆహార ఉత్పత్తులు అందుబాటులో లభిస్తున్నాయి.

వివిధ కూరగాయ ఉత్పత్తుల ధరలు......

ప్రస్తుతం ఏజెన్సీ వారపు ప్రాంతంలో లభ్యమవుతున్న వివిధ కూరగాయల ఉత్పత్తుల ధరలు ఈ విధంగా ఉన్నాయి. రైతుల నుంచి వ్యాపారులు నాగలి దుంపలను కిలో రూ.15 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అలాగే బస్తరు పిక్కలు కిలో రూ,150 నుంచి 200. కూరగాయల ఉత్పత్తులు సంతకు తక్కువగా వస్తే వ్యాపారులు పోటీపడి కొంటుండటంతో వాటికి ధర కొంచెం అధికంగానే లభిస్తోంది.

పాడేరు మార్కెట్‌లో కిలో టమోట రూ.40, వంకాయలు కిలో రూ.40, బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి కిలో రూ.60, అరటికాయ రూ.8కి అమ్ముతున్నారు. బంగాళదుంప కిలో రూ.30, దొండకాయలు రూ.40, . అల్లం కిలో రూ.250, బీరకాయలు కిలో రూ.60, ఆనపకాయ రూ.20, బొస్తరు పిక్కలు రిటైల్ గా 300 రూపాయల వరకు, అమ్ముతున్నారు.విశాఖ మన్యం పాడేరులో ఎక్కువ జరిగే సంతకు మంచి ప్రాధాన్యం వుంది. పాడేరులో వారానికి రెండు సార్లు మంగళవారం, శుక్రవారం జరిగే ఈ సంత ఎంతో సందడిగా ఉంటుంది. ముఖ్యంగా ఈ రెండు రోజుల్లో వ్యాపారులు రైతుల నుంచి పెద్ద ఎత్తున కూరగాయల ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. మిగిలిన ఐదు రోజుల్లో వినియోగ దారులు మాత్రమే కూరగాయలు కొనుక్కుంటారు. సుమారు 29 గ్రామాల నుండి గిరిజన రైతులు తెచ్చిన కాయగూరలు ఒకటే చోట అమ్మకాలు చేస్తుంటారు. గిరిజనులు వ్యవసాయ ఉత్పత్తులు, అడవిలో సేకరించిన దుంపలు ఆకుకూరలు, ఇతర అటవీ ఉత్పత్తులు ఉదయాన్నే సంతకు తీసుకువచ్చి విక్రయిస్తారు. వినియోగదారుల సైతం ఈ ఉదయం పూట జరిగే సంతకు వచ్చి వారానికి సరిపడా కాయగూరలు కొంటుంటారు. రైతుల వ్యాపారులు వినియోగ దారులతో ఉదయాన్నే పాడేరులో జరిగే ఈ సంత జనాలతో కళకళ లాడుతుంది.



సంతలో ఉంచిన క్యారెట్ తదితరాలు

నేవీ మారథాన్‌లో విజేతలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఇండియన్ నేవీ ఆధ్వర్యాన విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం వైజాగ్ నేవీ మారథాన్ విజయవంతంగా సాగింది. వివిధ కేటగిరీలలో సుమారు 20 వేల మంది పాల్గొన్నారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన మారథాన్‌లో పలువురు విజేతలయ్యారు. పురుషుల ఓపెన్ కేటగిరిలో 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో సికందర్ తడాఖే 2.30 గంటల్లో పూర్తి చేసి విజేతగా నిలవగా, 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌లో దీపక్ కుంభార్ 1.06 గంటల్లో, 10కె రన్‌ను సోను కుష్వాహ 0:31 గంటల్లో పూర్తి చేసి విజేతలుగా నిలిచారు.

మహిళల ఓపెన్ కేటగిరీలో 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో టిపి ఆశ 3.08 గంటల్లో పూర్తి చేసి విజేతగా నిలిచారు. 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌లో లిలియన్ రుట్టో 1.24 గంటల్లో, 10కె రన్‌ను లంక మేరీ గ్రేస్ 0:44 గంటల్లో పూర్తి చేసి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అవార్డులను ప్రదానం చేశారు.



రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

ధాబుగుడ- దోమలజోరు రోడ్డు నిర్మాణం

సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం పోరాట ఫలితం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని మాదల పంచాయతీ మారుమూల గ్రామాలైన ధాబుగుడ, రక్తకండి, దోమలజోరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం పోరాటం చేసింది. పోరాట ఫలితంగా అధికారులు ప్రస్తుతం రోడ్డు పనులు ప్రారంభించారు. తారురోడ్డు మంజూరు చేయాలని కోరుతూ ఆ పంచాయతీ సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన పాదయాత్ర, ధర్నాలు నిరసనలు చేపట్టి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వం సుమారు 8 కిలోమీటర్ వరకు రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.అధికారులు పనులు ప్రారంభించడంతో సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాంగి రామన్న, కె రమేష్, గోపాల్, అప్పన ఆనందం వ్యక్తం చేశారు.



రోడ్డుకిరువైపులా మొక్కలను తొలగిస్తున్న గ్రామస్తులు

రోడ్డుకిరువైపులా మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-జి.మాడుగుల: జి.మాడుగుల నుండి పాడేరు వెళ్లే ప్రధాన రహదారి మార్గ మధ్యలో సంత బయలు గ్రామ సమీపంలో రోడ్డు కి ఇరువైపులా ఉన్న మొక్కలను సంత బయలు గ్రామ సమీపంలో ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా స్థానిక సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, మొక్కలను రోడ్డుని కప్పి వేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ముందస్తుగా గుర్తించి తొలగించడం జరిగిందన్నారు.రాత్రి సమయంలో పొగ మంచు ఎక్కువగా కమ్ముకు పోవడంతో రోడ్డు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, 17219 మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 12718 విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12717 విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 17267 కాకినాడ-విశాఖపట్నం మెము స్పెషల్, 17268 విశాఖపట్నం-కాకినాడ మెము ప్రత్యేక రైళ్లను నవంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు రద్దు చేశారు. 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్, 17220 విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ లను నవంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు రద్దు చేశారు.

సమస్యలపై ఎంపికి వినతి



అరకు ఎంపీకి సమస్యలు విన్నవిస్తున్న ఎంపిటిసి అప్పారావు, ఇతర వైసిపి నేతలు

ప్రజాశక్తి-కొయ్యూరు : అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని విశాఖపట్నం ఎంవిపి కాలనీ సెక్టర్ 12లో ఉన్న ఆమె కార్యాలయంలో కొయ్యూరు మండలం డౌనూరు సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు బీడీజన అప్పారావు, వైసిపి నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డౌనూరు సెగ్మెంట్ పరిధిలో ఉన్న పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. ఎంపీ నిధులతో బోర్లు మంజూరు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాము ప్రస్తావించిన పలు అంశాలపై ఎంపీ సానుకూలంగా స్పందించారని ఎంపీటీసీ అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేముడు, రాజేష్, నాగరాజు, నూకరాజు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపి చైర్‌పర్సన్, వైస్ ఎంపిపిలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రావణాపల్లి గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపి చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, వైస్ ఎంపీపీ అప్పన వెంకట రమణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావణాపల్లి సెగ్మెంట్‌లోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధించిన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రీమల గంగాధర్, సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జి గాడి అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణింపుతో ఉజ్వల భవిష్యత్

- బాక్సింగ్ పతక విజేతలకు కాయల వెంకటరెడ్డి అభినందన

ప్రజాశక్తి-సీతమ్మధార: క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలు, ఉజ్వల భవిష్యత్‌ను పొందవచ్చునిఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడుచ ఎపి మార్‌టైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం సీతమ్మధారలోని తన కార్యాలయంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రా తరపున పాల్గొని పతకాలు సాధించి, రన్నరప్‌గా నిలిచిన క్రీడాకారులను అభినందించారు. ఢిల్లీలో గతనెల 27నుంచి 30 వరకు బిడిఎఫ్ఐ ఆధ్వర్యంలో నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రా బాక్సింగ్ అసోసియేషన్ క్రీడాకారులు 13బంగారు, 12 రజతం, ఏడు కాంస్య పతకాలను సాధించారు.

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

కార్తీక మాసం దృష్ట్యా సరికొత్త ఏర్పాట్లు

'ప్రజాశక్తి'తో టూరిజం సెల్ మేనేజర్ ఎన్.మురళి

ప్రజాశక్తి - అరకులోయ : పర్యాటక రంగ అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు రచించినట్టు ఐటిడిఎ పాడేరు టూరిజం సెల్ మేనేజర్ ఎన్.మురళి తెలిపారు. పర్యాటక ప్రదేశాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ఈ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. అందులో భాగంగానే అరకులోయ ప్రాంతంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఆయన్ని ఇటీవల 'ప్రజాశక్తి' కలవగా పలు విషయాలు వెల్లడించారు.





కార్తీక మాసాన్ని దృష్టిలో పెట్టుకొని పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఐటిడిఎ ద్వారా తీసుకుంటున్న చర్యలేంటి ?

పర్యాటకులను ఆకట్టుకునేందుకు అరకులోయలోని గిరిజన సాంస్కృతిక మ్యూజియంలో ఇటీవల ఆధునికీకరణ పనులు చేపట్టాం. సహజత్వం ఉట్టిపడేలా శిల్పాకృతులను తీర్చిదిద్దాం. మ్యూజియంలో త్రీడీ గ్యాలరీని ఏర్పాటు చేశాం. ఇది వీక్షించిన పర్యాటకులు ప్రత్యేక అనుభూతిని పొందుతున్నారు. అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భాగంగా మ్యూజియం ఆవరణలో జిప్ లైన్, స్కై సైకిళ్లతో పాటు రోప్ కోర్స్, కమాండోనేట్‌ను అదనంగా అందుబాటులోకి తీసుకొచ్చాం. పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని ప్రతి శని, ఆదివారాల్లో థింసా నృత్యాలను ఏర్పాటు చేస్తున్నాం. స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తున్నాం. మ్యూజియం ఆవరణలో బోటు షికారుకుగాను ఏర్పాటు చేసిన నాలుగు బోట్లులో రెండు మరమ్మతుకు గురయ్యాయి. వాటిని త్వరలో అందుబాటులోకి తెస్తాం.

ఐటిడిఎ పరిధిలో పర్యాటకులు చూడదగిన సందర్శిత ప్రాంతాలు ఏమేమున్నాయి?

అరకులోయలో గిరిజన సాంస్కృతిక మ్యూజియం, పద్మావతి గార్డెన్, గంజాయిగూడలో గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండల కేంద్రానికి సమీపంలో చాపరాయి జలపాతం, కొత్తపల్లి వాటర్‌పాల్, చెరువుల వ్యాన్ వంటివి ఉన్నాయి. తాజంగిలో అడ్వెంచర్ స్పోర్ట్స్, జిప్ లైన్, బోటింగ్, ఆర్చరీ సౌకర్యాలు ఉన్నాయి. పద్మావతి గార్డెన్ లోపల పాడేరు ఐటిడిఎ సుమారు రూ.36 లక్షలతో ట్రీ హార్ట్స్ స్థానంలో నిర్మించిన ట్రీ కాస్టిల్ గెస్ట్ హౌస్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకోనుంది.

పర్యాటక ప్రాంతాల్లో గతం కన్నా ఇప్పుడు తెచ్చిన మార్పులేంటి ?

గతంలో సౌకర్యాలు అక్కడక్కడా కొరతగా ఉండేవి. వాటిని ప్రస్తుతం పరిష్కరించి ముందుకు సాగుతున్నాం. చాపరాయి జలపాతం వద్ద ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

గతంతో పోలిస్తే టూరిస్టులు తగ్గారా ? పెరిగారా ?

కరోనా సమయంలో టూరిస్టుల తాకిడి తగ్గింది. ఆ తరువాత కాలంలో పరిస్థితులు పూర్వ స్థితికి వచ్చాక టూరిస్టులు క్రమేపీ పెరుగుతూ వచ్చారు. హైవే రోడ్డు రావడంతో మౌలిక వసతులు కూడా పెరిగాయి.

పర్యాటక అభివృద్ధిపై ఐటిడిఎ భవిష్యత్తు ప్రణాళిక ఏంటి ?

పాడేరు ఐటిడిఎ ద్వారా కొత్తకొత్త పర్యాటక సందర్శిత ప్రాంతాలను అన్వేషిస్తున్నాం. అందులో భాగంగానే మాడగడ సన్రైజ్ ప్రాంతాన్ని గుర్తించాం. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐటిడిఎ తీవ్ర కృషి చేస్తోంది. డుంబ్రిగుడ మండల పరిధిలోకి వచ్చే అంజోడా సిల్క్ ఫారంను కూడా అటవీశాఖ అధికారులు ఎకో టూరిజం పార్కుగా అభివృద్ధి చేస్తున్నారు.

మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?

పర్యాటక ప్రాంతంలో హైవే రోడ్డు రావడంతో చెట్లన్నీ తొలగించడం వల్ల పచ్చదనం తగ్గింది. ప్రతి ఒక్కరూ చెట్లు నాటే కార్యక్రమం చేపడితే అరకులోయకు పూర్వ వైభవం వస్తుంది. విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం అందరి సహకారంతో చేపట్టనున్నాం. స్వచ్ఛ అరకుపై దృష్టిపెట్టాం. కొత్తవలస హెచ్ఎన్‌టిసి గార్డెన్‌లో కూడా పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలో 12 కాటేజీల నిర్మాణం జరుగుతోంది. కొత్తగా వేసిన హైవే రోడ్డుకు ఇవి సమీపంలోనే ఉండడంతో మంచి ఆదరణ లభించనుంది.

పర్యాటకులకు మీరిచ్చే సందేశం ఏమిటి?

పచ్చని ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరంగా ఉన్న ప్రాంతాలను పర్యాటకులు ఆస్వాదించి వెళ్లాలి. మత్తు పానీయాలు సేవించి వాహనాలను డ్రైవింగ్ చేయకూడదు. ప్లాస్టిక్ రహిత అరకుకు అందరూ సహకరించాలి. ప్రమాదకరమైన ప్రదేశాల్లో సాహసం చేయకూడదు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి -గోపాలపట్నం : రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని అన్నారు. ఆదివారం జివిఎంసి 92వ వార్డు గోపాలపట్నం రైతుబజార్ దరి వుడా కాలనీలో రూ.5.50కోట్లతో అభివృద్ధి చేసిన 30 పడకల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా పేదల వద్దకే స్పెషలిస్ట్ వైద్యసేవలు అందుతున్నాయన్నారు. టిడిపి నేత లోకేష్ వైద్య ఆరోగ్య శాఖపై అవగాహన లేని ట్వీట్లు చేస్తున్నారని ఆరోపించారు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వైద్యఆరోగ్యశాఖలో ఎటువంటి సేవలు అందయో అందరికీ తెలుసన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని అనారోగ్యం పాల్జేసిన ఘనత చంద్రబాబుదేనని మండిపడ్డారు. కార్యక్రమంలో విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, డిప్యూటీ మేయర్ జియాని శ్రీధర్, వైసిపి పరిశీలకులు ఎస్ఎ రహమాన్, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వైసీపీ మహిళా నేత పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, నాగేశ్వరరావు, ఆడారి శ్రీను, బద్రీనాథ్, వైసిపి వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, నమ్మి శ్రీను, జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకష్ణ, మార్కెటింగ్ డైరెక్టర్ ఆల్ఫాకృష్ణ, ప్రసాద్ రెడ్డి, బండారు వరలక్ష్మి పాల్గొన్నారు.

సీతమ్మధార :జివిఎంసి 47వ వార్డు కప్పరాడలో రూ.1.25కోట్లతో నిర్మించిన యుపిహెచ్‌సి, ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని, 89వ వార్డు యల్లపు వానిపాలెం -1 (చంద్రనగర్)లో రూ . 1.76.కోట్లతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యసేవలు అందించాలని సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.పది లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందుతాయని తెలిపారు.

ఉరుములతో భారీ వర్షం



భారీ వర్షంతో వారపుసంతలో అవస్థలు పడుతున్న దుకాణదారు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం సాయంత్రం ఉరుములతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించడంతో ఎండ తీవ్రత మధ్యాహ్నం 2 గంటల వరకు అధికంగా ఉంది. అనంతరం ఆకాశం మేఘావృతమై మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది.

దీంతో సీలేరులోని ఆదివారం వారపు సంతకు మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు, వ్యాపారులు, వినియోగదారులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షం మినుములు, రాజ్మా, సామలు, కందులు తదితర పంటలకు కొంతమేరకు దోహదపడుతుందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఎల్‌వో, స్థానిక సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటర్ లిస్టులో పేరు ట్రాన్స్‌ఫర్, మీ పేరు ఉందా లేదా పరిశీలన, తప్పులను సరిదిద్దుకోవడానికి ఇది చక్కటి అవకాశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఓ రేవతి, అనుష్క పాల్గొన్నారు.

8న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఈనెల 8న బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోరా తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐసిఐసిఐ బ్యాంక్, ప్రైసీ గ్లోబల్ టెక్నాలజీ, ఆస్ట్రోటెక్ స్టీల్స్, బిఎస్ఎ, వెస్ట్ సైడ్, డైకిన్ ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని, రిలేషన్‌షిప్ మేనేజర్, రియాక్ట్ నేటివ్ డెవలపర్, టెక్నీషియన్, ఎగ్జిక్యూటివ్ అసోసియేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.బిఎస్‌సి, బిసిఎ, బికాం, బిబిఎ, బిటెక్, ఎంసిఎ, డిప్లమో, ఐటిఐ ఇంటర్, టెన్త్ ఉత్తీర్ణులై, 29ఏళ్ల వయస్సులోపు వారు ఏ కాలేజీకి చెందిన వారైనా ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడులో పనిచేయాల్సి ఉంటుందని, 340 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలునిర్వహిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.1.50 లక్షల నుంచి 3.30 లక్షల వరకు చెల్లిస్తారన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు రెజ్యూమ్‌తోపాటు ఆధార్‌కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫొటోస్, విద్యార్హతల సర్టిఫికెట్‌లతో ఆదర్శ్ కళాశాల డిజి సెమినార్ హాల్‌లో నిర్వహించే మెగా జాబ్ మేళాకు హాజరు కావాలని కళాశాల సెక్రటరీ టి.థియోఫిలాస్ తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రేవంత్‌కు స్వర్ణం

ప్రజాశక్తి -ఆనందపురం: విశాఖపట్నం అక్కయ్యపాలెంలో అబ్దుల్‌కలాం ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న 9వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్‌కుమార్ ఖాతా, కుమతి రెండు విభాగాల్లో బంగారు పతకాలను సాధించాడు. విక్టరీ షఉటో ఖాన్ కరాటే అకాడమీ కోచ్ టి.సాయికుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు పతకాలు సాధిస్తున్నారు. రేవంత్‌కు రెండు బంగారు పతకాలు రావడంపై అతని తల్లిదండ్రులు కుప్ప రాజశేఖర్, రామలక్ష్మి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు కోచ్ సాయికుమార్ శిక్షణలో పాల్గొన్న ప్రతి పోటీలోనూ రేవంత్ పతకాలను సాధించడంపై అతని తండ్రి ఆర్మీ ఉద్యోగి రాజశేఖర్ అద్భుతమన్నారు